క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 424 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

కులగణన చేయాలనే నిర్ణయం హర్షణీయం

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయాలని నిర్ణయించడం హర్షణీయం అని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 సంవత్సరాలుగా బీసీ సంఘం చేస్తున్న పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణనకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల సంఘం నాయకులు బి. సోమశేఖర్, ఎ. ఆదివిష్ణు, షేక్ సయ్యద్, వెంకట కృష్ణారావు, ఎస్. శేషుబాబు, శ్రీనివాసరావు, గోవర్ధన రావు, రామకృష్ణ, సత్యన్నారాయణ, రమణ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

డ్రైయిన్ పూడికతీత పనుల పరిశీలన



గుడ్లవల్లేరు: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. విన్నకోట మీడియం డ్రైయిన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరావు, డ్రెయినేజ్ ఏఈ భోగేంద్రప్రసాద్, సర్పంచ్ కాగిత నరేంద్ర పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు



అయ్యంకి(మొవ్వ): అయ్యంకిలో రెండు రోజులుగా అనుమతులు లేని మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గ్రామ చివర నివాస గృహాల మధ్యలో ఉన్న చెరువు కూడికలు తీయడంలో అధికారులు, మైనింగ్ శాఖ అనుమతులు లేక పోయినా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల తహసీల్దారు కే మస్తాన్ సచివాలయ వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి, అనుమతులు లేని మట్టి తవ్వకాలపై నిఘా పెట్టి తెలియపరచాలని ఆదేశాలు జారీ చేశారు. అవి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమయ్యాయి. అయ్యంకి రహదారి పక్కనే ఉన్న సుమారు తొమ్మిది ఎకరాల చెరువులో పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారుల పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై తహసీల్దార్ మస్తాన్‌ను వివరణ కోరగా అయ్యంకి గ్రామంలో ఎటువంటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

జాతీయ రహదారి.. ప్రమాదాలకు నిలయం

స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతోనే..



జాతీయ రహదారిలో బల్లిపర్రు వద్ద ప్రమాదకరంగా ప్రయాణం

పామర్రు: మచిలీపట్నం-విజయవాడ ప్రధాన జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ జాతీయ రహదారిలో నిరంతరం వేలాది వాహనాలు వేగంగా ప్రయాణిస్తూ తమ గమ్య స్థానాలకు చేరుకుంటుంటారు. జాతీయ రహదారి పామర్రు బైపాస్ గుండా వెళుతుంది. మండలంలోని కురుమద్దాలి, బల్లిపర్రు, కొండిపర్రు, జుఝువరం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం బైపాస్ ఉంది. ఈ రహదారిపై కనుమూరు, బల్లిపర్రు అడ్డరోడ్డు, జుఝువరం, కొండిపర్రు అడ్డ రోడ్ల వద్ద ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

జనవరి నుంచి 100కుపైగా ప్రమాదాలు

జాతీయ రహదారి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే చోట్ల స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 100కు పైగా ప్రమాదాలు ఈ ప్రాంతాల్లో జరిగాయి. 10 మంది వరకు మృతి చెందారు. ఆటోలు, మోపెడ్ వాహన చోదకులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడం కూడా రోడ్డు ప్రమాదాలకు మరో కారణం అవుతున్నాయి.

వెలగని వీధి దీపాలతో అవస్థలు

జాతీయ రహదారి వెంబడి వీధి దీపాలు అలంకార ప్రాయంగానే మారాయి. ఇవి ఎక్కడా వెలిగే పరిస్థితి లేదు. దీని వలన రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాల్సిన అవసరం ఉంది.

పోలీస్ గస్తీ అంతంతమాత్రం

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నియంత్రించేలా పోలీసులగస్తీ నిర్వహించాల్సి ఉంది. బల్లిపర్రు, కొండిపర్రు, జుఝువరం అడ్డరోడ్ల వద్ద పోలీసుల గస్తీ అంతంగా మాత్రంగానే ఉండటంతో ప్రమాదాలు చేటుచేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు జాతీయ రహదారి వెంబడి ఉన్న బెల్టు షాపులు, హోటళ్లు తెరచి ఉన్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా పటిష్టమైన చర్యలతో పాటు గస్తీలను కూడా ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రదేశాల్లో తప్పని సరిగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో మద్యం దుకాణాలు, హోటళ్ల వద్ద నిబంధనలు పాటించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– కొలుసు కోటేశ్వరరావు, జుఝువరం

రహదారి వెంబడి లైట్లు వెలిగేలా చూడాలి



జాతీయ రహదారి వెంబడి ఉండే వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. హోటళ్ల వద్ద రోడ్డు మధ్య వరకు వాహనాలు నిలిపి ఉంచకుండా తగు చర్యలు తీసుకోవాలి.

– కుందేటి రాణి, బల్లిపర్రు

చర్యలు తీసుకుంటాం



జాతీయ రహదారి ప్రధాన కూడళ్ల వద్ద గస్తీలు నిర్వహిస్తున్నాం. ప్రయాణికులు కూడా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. రాత్రి వేళల్లో జాతీయ రహదారి వెంబడి లైట్లు వెలగటం లేదు. దీని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపి తగు చర్యలు తీసుకుంటాం.

– రాజేంద్రప్రసాద్, పామర్రు ఎస్‌ఐ

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి



జమీగొల్వేపల్లిలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమంలో విద్యార్థులు



అంగలూరులో విద్యార్థులకు విజ్ఞాన శిబిరం

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన శక్తికి, మనోవికాసానికి వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని మెరుగు పరచుకోవడానికి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ దోహద పడతుందన్నారు.పి పద్మావతి, గ్రంథాలయ అధికారి నాగ సురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకపఠనంపై శనివారం అవగాహన కల్పించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. అనంతరం వాలీబాల్ ఆడించినట్లు పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి తెలిపారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు నీతికథలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శనివారం సహచర విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి నీతి కథలు చెప్పారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఎక్కాలు వల్లెవేయించారు.

యోగా, ధ్యానంపై శిక్షణ

కైకలూరు: కలిదిండి మండలం కోరుకొల్లు శాఖ గ్రంథాలయం వద్ద చిన్నారులకు యోగా, ధ్యానం, పుస్తక పఠనం నేర్పించారు. గ్రంథాలయాధికారి రాఘవులు మాట్లాడుతూ జూన్ ఆరో తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న మండలి హనుమంతరావు

గుడివాడ టౌన్: ప్రతిభగల యువ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో క్రికెట్ పోటీల్లో కప్ సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల రెల్లి కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో గుడివాడకు చెందిన రాజ్ సీసీ జట్టు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం చేజిక్కించుకున్నారు. దీంతో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ ఆకుల మహేష్, క్రీడాకారులు ధనాల ఫణీంద్ర, ముత్యాల రాజేష్, ఫణి, లక్కి, చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకుడు కె. ఆంజనేయ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



పెదమద్దాలిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న కిశోర బాలికలు



అంగలూరులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్ వాణి



తోట్లవల్లూరులో అవగాహన కల్పిస్తున్న ఎంఎస్‌కే శిరీష

పామర్రు: బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాస కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 నుంచి 18 ఏళ్ల లోపు కిశోర బాలికలకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం, శుక్రవారం సమావేశమై వారికి ఆరోగ్యపరమైన అంశాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ శైలజ, ఏఎన్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

పెదమద్దాలిలో..

వేసవి సెలవుల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం కిశోర వికాసం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయ కుమారి అన్నారు. మండలంలోని పెదమద్దాలిలో కిశోర బాలికలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశ ప్రారంభం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కిశోర బాలికలకు వికాసంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.వాణి పేర్కొన్నారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులను శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులపై బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

కొండిపర్రు(పామర్రు): బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ఆరోగ్య కార్యకర్తలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు కలిసి పనిచేయాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కొండిపర్రు గ్రామంలో శనివారం కిశోర వికాసంపై గ్రామస్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే పీ నాగరాణి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: గుడివాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్-1 ఆధ్వర్యంలో శనివారం కిశోర బాలికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ వరకు కిశోర్ వికాస్-వేసవి సెలవలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీడీకే భవాని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఎస్‌కే శిరీషా సూచించారు. స్థానిక నార్తువల్లూరు గ్రామ సచివాలయం వద్ద కిశోర వికాసంపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది.

కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై శిరీష అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా డీసీపీఓ జె.స్వరాజ్యం మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ సీతారామాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, అంకుర్పారణ, వాస్తుపూజ, అఖండ దీపారాధనతో పాటు హోమ, విగ్రహ పూజలను నిర్వహించారు. వడాలి జగన్నాథస్వామి ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పేర్ని పృథ్వి, పిట్టల మోహనరావు దంపతులు పూజలు చేశారు.

మొక్కుబడిగా మండల సమావేశం



మొవ్వ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ జే విమాదేవి ఊకదంపుడు ఉపన్యాసంతో సాగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ సమావేశం మధ్యాహ్నం 12.10 నిముషాలకు ప్రారంభించారు. సుమారు రెండు గంటలకు పైగా ఎంపీడీఓ ప్రజా ప్రతినిధులకు, వివిధ శాఖ అధికారులకు యోగాపై శిక్షణ, ఇతర సంబంధం లేని విశేషాలపై చర్చిస్తూ కాలయాపన చేశారు. ఒకానొక సమయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విసుగుచెంది సమావేశ మందిరాన్ని విడిచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే రావటం లేదన్న సమాచారం తెలుసుకున్న అనంతరం తూతూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సమావేశానికి ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేదల వైద్యానికి ప్రాధాన్యం



కైకలూరు: ప్రభుత్వం పేదల వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. వరహాపట్నంలో ఆయన ఇంటి వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. మొత్తం రూ.7,33,535 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడికి సత్కారం



షమ్మును సత్కరిస్తున్న గొర్ల శ్రీను

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ గుడివాడ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షమ్మును పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను శనివారం సత్కరించారు. ఏలూరు రోడ్‌లోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి నూతనంగా నియమితులైన షమ్మును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని నాయకత్వంలో గుడివాడలో పార్టీకి పునర్వైభవం తేవడానికి తామంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు షేక్ బాజీ, తాజుద్దీన్, షకీర్, కరీముల్లాబేగ్, కార్మిక నగర్ నూర్ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల జీఓను ఉపసంహరించుకోవాలి

గుడివాడ టౌన్: పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. చంద్రశేఖర్, పి.ఇమ్మానుయేల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 19 నుంచి జరగబోయే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆదివారం కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ 33 పేజీల ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల్లో వేసవి సెలవుల్లో పనిచేసినందుకు దామాషాగా సంపాదిత సెలవులు మంజూరు చేయాలనే విషయాన్ని కూడా ఈ ఉత్తర్వులలో పేర్కొనకపోవడాన్ని వారు ఖండించారు. 40 డిగ్రీలు మించి ఉష్ణోగ్రత ఉన్న ఈ వేసవిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించాలనడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

మండవల్లి: ఈ నెల 22న సాయంత్రం మూడు గంటలకు జై హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆ యాత్ర కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. స్థానిక చెరువు గట్టుపై ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించండి

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని ఉపాధి కూలీలతో ఆయన శనివారం మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. యంత్రాలతో పని చేయించి సిమెంట్ రోడ్లు ప్రభుత్వ భవనాలు నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఈ నెల 5న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన లూర్థు మాత మహోత్సవాలు



ఉత్సవాల్లో మాట్లాడుతున్న పీఠాధిపతులు జోసఫ్ రాజారావు

మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో విచారణ గురువులు సంకుర్ల శాంతిరాజు ఆధ్వర్యంలో జరిగిన లూర్థు మాత మహోత్సవాలు శనివారం ముగిశాయి. పురవీధుల్లో లూర్థు మాత స్వరూపంతో చేసిన ప్రదక్షిణ ఆకట్టుకుంది. విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు(ఎస్ఎంఎం) పర్యవేక్షణలో సమష్ట బలిపూజ జరిగింది.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కైకలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో శ్రీరామాలయం పునర్నిర్మాణ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో శనివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తా

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దేవపూడిలో పెదలంక, వైవాకలో ఊటుకూరు డ్రెయిన్ల తవ్వకం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. డ్రెయిన్ల పరిధిలో భూములు ముంపుబారిన పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు గుర్తించామన్నారు. దీనిని నివారించేందుకు డ్రెయిన్ల తవ్వకం పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

పమిడిముక్కల: యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి డీలర్లకు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం పీఏసీఎస్ డీలర్లకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన ఎరువులను గోదాముల్లో స్టాక్ ఉంచుకోవాలని తెలిపారు.